క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడరూరల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ టి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్, బ్యాంక్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, చౌదరి పేటల్లో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: దేవరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా ఉండబోదని ఉయ్యూరు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరపల్లి సబ్‌స్టేషన్లో సాంకేతిక మరమ్మతుల కారణంగా ఉదయం ఎనిమది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మహిళలకు రక్షణగా చట్టాలు



కైకలూరు: మహిళలకు రక్షణగా చట్టాలు అందుబాటులో ఉన్నాయని సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి పేర్కొన్నారు. కైకలూరు బీసీ బాలికల కాలేజీ వసతి గృహాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. భోజనశాల, తాగునీరు సౌకర్యం, వంట పదార్థాలను పరిశీలించారు. అనంతరం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నూతనంగా అమల్లోకి వచ్చిన చట్టాలను వివరించారు. న్యాయవాదులు ఎంవీవీ సత్యనారాయణ, పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, ఎ.రాంబాబు, ఏఎస్సై మల్లికార్జునరావు, వార్డెన్ రాధా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె

పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీ అంకమ్మతల్లి ఆలయంలోని అమ్మవారికి మహిళలు శనివారం ఆషాఢ సారెను సమర్పించారు. స్థానిక కోటిరెడ్డిపేట, గాంధీ నగరం, మూలమలుపులు తదితర ప్రాంతాల్లో మహిళలు ఊరేగింపుగా ఆలయం వద్దకు ఆషాఢ సారెతో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు, పూజాధికాలను నిర్వహించామని ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు తెలిపారు.

కలాం సేవలు మరువలేనివి

గుడ్లవల్లేరు: భారత దేశానికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ చైర్మన్ సింగంశెట్టి ఆదినారాయణ అన్నారు. కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన క్షిపణి పితామహుడు కలాం అని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గంగానమ్మతల్లి జాతర

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు గ్రామంలో ఆదివారం శ్రీ గంగానమ్మ తల్లి బోనాల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బోయిన శివయ్య శనివారం తెలిపారు. గంగానమ్మ తల్లికి మహిళలు నెత్తిపై బోనాలు పెట్టుకుని ఊరంతా తిరిగి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారని పేర్కొన్నారు.

బాలకార్మికులతో పని చేయిస్తే కఠిన చర్యలు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): దుకాణాల్లో బాలకార్మికులు, మైనర్లతో పని చేయిస్తే ఆయా యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ లేబర్ ఆఫీసర్ వీఎస్ బిందు హెచ్చరించారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో చిల్లర దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్లను దుకాణ యజమానులు పని చేయిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు.

వెదసాగులో కలుపు నివారణ తప్పనిసరి



వ్యవసాయాధికారి అనంతలక్ష్మి



పురుగులమందు పిచికారీ చేస్తున్న రైతు

గుడ్లవల్లేరు: వెద పద్ధతిలో సాగు చేసిన వరిలో కలుపు సమస్య జఠిలమైతే జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కూలీల కొరత అధికమైంది. కూలి రేట్లు పెరిగిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు కలుపు మందుల వైపు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, స్థానిక వ్యవసాయాధికారుల సిఫార్సు చేసిన మేరకే కలుపు మందులను వాడాలి. దీనివలన తక్కువ ఖర్చుతో కలుపు నివారించవచ్చు. అంతేగాక సకాలంలో సమర్థవంతంగా కలుపు నివారణ జరుగుతుంది. వరి సాగులో ఆశించిన మేరకు అధిక దిగుబడులను సాధించేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయని గుడివాడ వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి పేర్కొన్నారు. వెద పద్ధతిలో సాగు చేసిన వరిలో అత్యధికంగా వచ్చే కలుపు నివారణకు పిచికారీ పద్ధతులపై ఇస్తున్న సలహాలు ఇవే..

12 రోజుల్లోపు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విత్తిన 8–12 రోజుల మధ్యలో పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్(సాధి) 100 గ్రాములు లేదా ఇథాక్సీ సల్ఫ్యూరాన్(సన్‌రైజ్) 40 గ్రాముల పొడి మందును 1/2 లీటరు నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని 200 మిల్లీలీటర్ల నీటిలో కలిపి చల్లుకోవాలి. ముందుగా పొలంలో నీటిని తీసివేసి సమానంగా పిచికారీ చేసినట్లయితే అన్ని రకాల కలుపు మొక్కలను నివారించవచ్చు.

25 రోజులకు చేపట్టాల్సిన చర్యలు

విత్తిన 20–25 రోజులకు పొలంలో ఊద ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. సైహాలో ఫాస్ బ్యూటైల్(క్లిన్‌చర్) 400 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి వాడాలి. వెడల్పాకుతో పాటు గడ్డి జాతి కలుపు మొక్కలు ఎక్కువగా వస్తే బిస్ పైరీబ్యాక్ సోడియం(నామిని గోల్డ్) 100 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి. అదే పద్ధతిలోనే వెడల్పాటి కలుపు మొక్కలు ఎక్కువగా వస్తే 2, 4డి సోడియం లవణాన్ని 500 గ్రాములు (2.5 గ్రాముల చొప్పున ఒక లీటరు నీటిలో కలిపి) ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం

గుడివాడరూరల్: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం స్థానిక వీకేఆర్ వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు వినియోగిస్తే జరిగే అనర్థాలు, ర్యాగింగ్ మీద న్యాయసేవా సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా ఉండాలన్నారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. క్రమ శిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. డీఎస్పీ పి.శ్రీకాంత్ మాట్లాడుతూ గుడివాడ సబ్ డివిజన్‌లో ఎక్కడైనా నిషేధిత గంజాయి, డ్రగ్స్, కొకైన్, హెరైన్ తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అజయ్‌బాబు, న్యాయవాదులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్ ప్రారంభం



ట్యాంకర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాము

గుడ్లవల్లేరు: గుడివాడ ఏఎంసీ మాజీ చైర్మన్ దివంగత కొసరాజు వెంకటాద్రి చౌదరి జయంతి వేడుకలను శనివారం గుడ్లవల్లేరులో ఘనంగా నిర్వహించారు. కొసరాజు విగ్రహానికి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తాగునీటి ట్యాంకర్‌ను ప్రారంభించి మహిళలకు మంచినీటిని ఆయన అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లభనేని వెంకట్రావు, కొడాలి రామరాజు, పొట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు డీఎన్నార్ పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: మనస్థాపంతో ఉరేసుకుని మృతి చెందిన కలిదిండి మండలం సానారుద్రవరం గ్రామానికి చెందిన విన్నకోట రామకృష్ణ (39) కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారథి, శ్రీనివాసరావు, నారాయణ, బుజ్జి, వివేకానంద, విష్ణు, భోగేశ్వరరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, నోము, హరిబాబు ఉన్నారు.

గోకుల పథకాన్ని వినియోగించుకోండి



వెటర్నరీ ఏడీ లక్ష్మీనారాయణ

గుడ్లవల్లేరు: గోకులం షెడ్ల నిర్మాణ పథకాన్ని వినియోగించుకోవాలని వెటర్నరీ గుడ్లవల్లేరు ఏడీ డాక్టర్ ఎ.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఈ గోకులం పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. రెండు గేదెల షెడ్డుకు రూ.1.15 లక్షలు, నాలుగు గేదెల షెడ్డుకు రూ.1.85 లక్షలు, ఆరు గేదెల షెడ్డుకు రూ.2.30 లక్షల మూడు అంచనాలతో గేదెలకు పాడి రైతులు షెడ్లను నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మూడు యూనిట్లలో పాడి రైతుల వాటా కేవలం 10 శాతమే ఉంటుందన్నారు. మిగిలిన 90 శాతం నిధులన్నీ ఉపాధి పథకం కింద మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే గొర్రెలు, మేకలతో పాటు కోళ్ల షెడ్ల నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 20 జీవాల షెడ్డుకు రూ.1.30 లక్షలు, 50 జీవాల షెడ్డుకు రూ.2.30 లక్షలు, వంద కోళ్లకు రూ.87 వేలు, 200 కోళ్లకు రూ.1.32 లక్షల షెడ్లను నిర్మించుకునేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ యూనిట్లలో లబ్ధిదారుల వాటా కేవలం 30 శాతమే ఉంటుందన్నారు. మిగిలిన 70 శాతం నిధులన్నీ ఉపాధి పథకం కింద మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెల్ల రేషను కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్న దరఖాస్తుదారులే ఈ గోకులం పథక షెడ్ల నిర్మాణానికి అర్హులని తెలిపారు. అర్హులైన దరఖాస్తుదారులు వెంటనే తమ సమీప పశు వైద్యశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఏడీ లక్ష్మీనారాయణ కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం ప్రసాద్

పమిడిముక్కల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఉపాధ్యాయులు రత్నకుమారి, లక్ష్మి పేర్కొన్నారు. తాడంకి హైస్కూల్లో క్రీడల్లో రాణిస్తున్న పలువురు క్రీడాకారులకు రత్నకుమారి, లక్ష్మి కలిసి శనివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం ప్రసాద్, పీడీ రవీంద్రబాబు పాల్గొన్నారు.


ఖరీఫ్ సాగులో రైతులకు సూచనలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

గుడివాడరూరల్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో ఖరీఫ్ సాగులో రైతులకు వ్యవసాయశాఖ అధికారులు తప్పనిసరిగా సూచనలు, సలహాలు అందించి జాగ్రత్తలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కె.శ్రీనివాసరావు సూచించారు. గుడివాడ వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సాగులో చేపట్టాల్సిన చర్యలు, జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించే సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాధికారులు ఆత్మవారిని సమన్వయంతో కలుపుకుని రైతులకు వరిసాగులో సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానం, భూసార పరీక్ష ఫలితాల ప్రకారం ఎరువుల వినియోగం, నాట్ల ప్రక్రియలో సమగ్ర కలుపు నివారణ, సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించి సూచనలు, సలహాలు అందించారు. గుడివాడ వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి మాట్లాడుతూ సాగులో రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకువస్తే వారు సలహాలు ఇస్తారన్నారు. సాగులో మోతాదులకు మించి ఎరువులు వాడకం తగ్గించాలని, అలా చేస్తేనే దిగుబడి పెరుగుతుందన్నారు. మోతాదులకు మించి ఎరువులు వాడితే పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. రైతులు కూడా అధికారుల సూచనలు పాటించాలని కోరారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి, ఏఈఓ వి.అనిత తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



పెయ్యేరు పాఠశాల్లో కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. సంఘర్షణపురం ఉర్దూ ప్రాథమిక పాఠశాల్లో ఎంఈఓ కె.నరేష్‌కుమార్ కిట్లను పంపిణీ చేశారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బేతాల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుడు సీహెచ్ చక్రధర్ విద్యార్థులకు కిట్లను అందజేశారు.

రేపు విశ్రాంతి ఉద్యోగుల సమావేశం

గుడ్లవల్లేరు: నిధి ఆప్కే నికత్ ప్రావిడెంట్ ఫండ్ మీ ముంగిట పేరిట గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు భవిష్య నిధి కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ నెల 29న ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగే సమావేశానికి ఉద్యోగ పెన్షన్‌దారులు తప్పనిసరిగా విచ్చేసి, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని కోరారు.

కానుకొల్లులో డ్రెయిన్ల అభివృద్ధి

మండవల్లి: కానుకొల్లులో సర్పంచ్ నాగదాసి థామస్ పర్యవేక్షణలో శనివారం డ్రెయిన్లు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు సోకకుండా డ్రెయిన్లు శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి ఎస్‌వీ రాధిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

31న పాలిటెక్నిక్ కోర్సు స్పాట్ అడ్మిషన్లు

కైకలూరు: పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశాలకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కలిదిండి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డీఎస్‌వీఎస్.ప్రసాద్ శనివారం తెలిపారు. కాలేజీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల్లో సీట్లు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అందరూ దీనికి అర్హులని తెలిపారు. పాలిసెట్ రాసిన, రాయని విద్యార్థులు అందరూ స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. పాలిసెట్ పరీక్ష రాయని విద్యార్థులు కళాశాల ఫీజుతో పాటు రూ.400 అదనంగా చెల్లించాలని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

మండవల్లి: కానుకొల్లు బాలికోన్నత పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. సమాజం నుంచి మనకు మనం ఎలా కాపాడుకోవాలి అనే విషయంపై, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు తదితర అంశాలపై సూపర్‌వైజర్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండవల్లి హెల్త్ సూపర్‌వైజర్ మోతిబాయి, ఏఎన్ఎం కమల, ఎంఎస్‌కే తేజోవతి పాల్గొన్నారు.

వార్డెన్లను ఎక్కడ ఉన్న వారిని అక్కడే ఉంచాలి

పామర్రు: సోషల్ వెల్ఫేర్ బీసీ వసతి గృహాల వార్డెన్‌లను ఎక్కడ వారిని అక్కడే ఉండేలా చర్యలు తీసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మచిలీపట్నంలో శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పామర్రులోని బీసీ వసతి గృహానికి చెందిన వార్డెన్‌ను ఇతర ప్రాంతాలకు డెప్యుటేషన్‌పై తరలించి అక్కడ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేసిన కారణంగా ఇక్కడి వసతి గృహం బాలికలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎక్కడ వార్డెన్‌లను అక్కడే ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్రను కోరామని తెలిపారు. నిమ్మకూరు జెడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయులు లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే గణిత ఉపాధ్యాయులను నియమించాలని మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై మంత్రి మాట్లాడుతూ పై సమస్యల పరిష్కారానికి తగు విధమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



గుడివాడ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న సంఘ నాయకులు

గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్లో యాదవ సేవా సంఘం, శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యం అధిగమించాలంటే మొక్కలు నాటడమే మార్గమన్నారు. విద్యార్థి దశ నుంచే చిన్నారులకు మొక్కలు పెంచే కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. వైశ్య సంఘ నాయకుడు తిరుపతయ్య, యాదవ సంఘ నాయకులు వెంకట నాగబాబు, తాతారావు హరిబాబు, హెచ్‌ఎం రాణి పాల్గొన్నారు.

మండవల్లి హైస్కూల్లో శిక్షా సప్తాహ్

మండవల్లి: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా న్యూట్రి గార్డెన్ కార్యక్రమం మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో శనివారం ఇన్‌చార్జి హెచ్‌ఎం శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథి సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన కూరగాయల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పండ్లు, కూరగాయల మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు, ముళ్లపూడి సత్తిబాబు, శ్యామ్, గణేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ నరేష్‌కుమార్ పలు పాఠశాలలను పరిశీలించారు. గురజ, పెదపాలపర్రు, ముదినేపల్లి, వడాలి జెడ్పీ హైస్కూల్స్‌తో పాటు వాడవల్లి, నరసన్నపాలెం, పెదపాలపర్రు, చినకామనపూడి, చిగురుకోట, పెయ్యేరు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు మొక్కలు నాటించారు.

దోమల నివారణ మందు పిచికారీ

కైకలూరు: దోమల నివారణ మందును వేమవరప్పాడు గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పలు వీధుల్లో శనివారం పిచికారీ చేయించారు. వైద్య సిబ్బంది శ్రీనివాసరావు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్టాప్ మలేరియా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ నున్న రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెదపారుపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

గంజాయి మహమ్మారిని తరిమికొడదాం

ముదినేపల్లి రూరల్: సమాజాన్ని పట్టిపీడిస్తున్న గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు విద్యార్థులతో పాటు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ అంబుల మనోజ్, అమరావతీ బ్రాండ్ అంబాసిడర్, వైద్యవిద్యార్థిని అంబుల వైష్ణవి అన్నారు. గంజాయికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మండలంలోని గురజ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బి.కృష్ణమోహనరావు, ఉపాధ్యాయులు మాలతి, పాండురంగారావు, గోసియా పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలో ఎకో క్లబ్‌లు



గూడూరు: పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్ ఆరో రోజు శనివారం గూడూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో ముమ్మరంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పాఠశాల స్థాయిలో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా విద్యార్థులతో క్లబ్ ఏర్పాటు చేశారు. ఎకో క్లబ్‌ల ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించడమే కాకుండా వాటిని పరిరక్షించే విధంగా విద్యార్థులను చైతన్య పరిచారు. పెద్ద ఎత్తున నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సాగునీటి వృథాను అరికట్టారు

సాక్షి స్పందన



కాలువ కట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

తోట్లవల్లూరు: మండలంలోని పెనమకూరు వద్ద బందరు కాలువ పొంగి సాగు నీరు వృథాగా పోతున్న విషయమై 'వృథాగా పోతున్న సాగు నీరు' శీర్షికన సాక్షిలో శనివారం వార్త ప్రచురితమైంది. దీనిపై కంకిపాడు సెక్షన్ ఇరిగేషన్ ఏఈఈ వీరాంజనేయులు స్పందించారు. బందరు కాలువలో నీటి మట్టాన్ని తగ్గించటంతోపాటు కాలువ కట్ట కోతకు గురి కాకుండా ఇసుక బస్తాలతో ఇరిగేషన్ సిబ్బంది నష్ట నివారణ చర్యలు తీసుకున్నారు. సాగునీటి వృథాను అరికట్టిన అధికారులకు రైతులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మోపర్రు(పెదపారుపూడి): గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని యలమర్రు పశువర్ధకశాఖ ఏడీ నరసింహారావు పేర్కొన్నారు. పెదపారుపూడి మండలంలోని మోపర్రులో శనివారం పశువులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువుల్లో గర్భ సంబంధిత వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. సూడి సమయంలో గేదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం 70 గొర్రెలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ జయంత్, డాక్టర్ వనిత పాల్గొన్నారు.